


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### గతంలోకి..

**నెయ్యి గిన్నె** వేడి చెయ్యడానికి పెరట్లో పెడితే, నేతి చెమ్చా కాకి ముక్కున కరుచుకుని ఎగిరిపోవడం మీకు గుర్తుందా? ఆ వెండి చెమ్చా కోసం నేను చాలాసార్లు ఎగిరే కాకి కింద పరిగెత్తాను కూడానూ!

వేసవికాలం ఇంటి తలుపులు బార్లా తెరుచుకుని, నవారు మంచం వేసుకుని, బయటనున్న చెట్ల నుండి, కిటికీల గుండా గాలి కొడ్తుంటే, ఫ్యాన్ లేకుండా, చెమటలు లేకుండా మధ్యాహ్నాలు పడుకోవడం మీకెవరికైనా గుర్తుందా?

అద్దం మీద ముక్కులతో 'టకటక' పొడుస్తూ, తమ ప్రతిబింబాలతో పోట్లాడే పిచ్చుకలు, అప్పుడప్పుడు వెంటిలేటర్లలో నుండి కింద పడిపోయే పిచ్చుక గుడ్లూ చూసిన గుర్తుందా?

ప్రొద్దుటే మనం ఇంకా మొహాలు కడుక్కోక ముందే ఇసకలో స్నానాలు చేస్తూ, రెక్కలు ఆరపెట్టుకునే పిచ్చుకమ్మలు మీకు చూసిన గుర్తుందా?

ఆరుబయట మంచాలు వేసుకునో, ఏ.సీల మీద ఆధారపడకుండా, పైన జాబిలీ, కురిసే వెన్నెలా, తడిసి హాయిగా పక్కలూ, పక్కన మంచినీళ్ళ మరచెంబులూ, దుప్పటి లాక్కుంటూ 'రాక్షసుడి కథలు' చెప్పే అన్నదమ్ములూ, అక్క చెల్లెళ్ళూ గుర్తుకొచ్చారా?

అట్ల తద్దెనాడు రాత్రే అరచేతుల్లో గోరింటాకులు పెట్టి, మధ్యలో బంతి ఆకువేసి, తెల్లారు ఝామునే ఉయ్యాలలు కట్టి లేపి, ఆటలాడాకా గోంగూర పచ్చడన్నం, మీగడ పెరుగుతో నంజిపెట్టి, అట్లవాయినాలు ఇచ్చిన మన అమ్మల కమ్మదనం గుర్తుచేసుకోండి.

చలికాలం, నాలుగింటికి నగర సంకీర్తన అంటూ నాలుగు వీధులూ తిరుగుతూ "భజో మధుర హరి నాం భజోరే భజో మధుర హరినాం" అని పాడడం, వణికించే చలిలో అదో అద్వితీయం కదూ.

డిసెంబర్ మాసంలో "చిన్న ఏసూ, పసుల పాకలో పుట్టినాడమ్మో.. తారలెల్లరూ దిగివచ్చినారయ్యో" అని పాడుకుంటూ పిల్లలు రాత్రిపూట స్వెట్టర్లలో ఇంటింటికీ వెళ్ళడం, వాళ్ళు ఇచ్చిన పిప్పరమెంట్లు తీసుకోవడం చూసిన గుర్తుందిగా?

వర్షాకాలంలో ఒళ్ళు తెలియకుండా నోటు పుస్తకాలు చింపి కూడా పడవలు చేసి, వాననీటిలో 'పడవరేసులు' పెట్టుకుని, మర్నాడు బడిలో వేప బెత్తం దెబ్బలు తిన్నవాళ్ళు మరిచిపోతారా?

వేసవికాలం దేవుడు తాటి ముంజెలూ, కొబ్బరి బొండాలూ, చల్లని చెరుకు రసాలు, మావిడిపండ్లూ, మల్లెపూలూ పంపిస్తాడు. వేసవి కాలం వచ్చిందనగానే మల్లెపూల జడలు కోసం ఎదురుచూసే అమ్మాయిలు, వాటికి మరింత అందం రావాలని తెలిసిన వాళ్ళింటికి వెళ్ళి కనకాంబరాలు కోసుకొచ్చి అమ్మతో పూల జడ వేయించుకుని ఫొటో స్టూడియోకి వెళ్ళి ఫోటో తీయించుకోవడం కోసం ఎంత సరదా పడేవాళ్ళమో గుర్తుందా? ఇప్పుడు పెళ్ళి కూతుళ్ళు తప్ప పూల జడలు వేసుకునే పిల్లలు కనపడుతున్నారా? వెనక అద్దం పెట్టి స్టూడియోలో తీసిన పూలజడ ఫోటో ప్రతి కన్నెపిల్లకి ఒకటైనా ఉండేది.. గుర్తుందా? అలాగే పువ్వులన్నీ ఒకేవైపుకి తిరిగేట్టు కాలిమాల(బొటనవేలికి దారం వేసి చుట్టు తిప్పి పువ్వు మధ్యలో పెట్టి, దారం దానికి తిప్పి ముడిలా వెయ్యాలి) చేమంతులతో కట్టేవాళ్ళు గుర్తుందా!

వర్షాకాలం, మొక్కజొన్న పొత్తులూ, తేగలూ, తంపటేసిన వేరు సెనక్కాయలూ, వేడి వేడి పకోడీలూ తినమంటాడు.

చలికాలం, దీపాలు పెట్టగానే 'గూట్లో దీపం, నోట్లో ముద్ద' అని, వేడి వేడి వేపుడు ముక్కలూ, పప్పుచారూ వేసుకుని ఊదుకుంటూ తిని పడుకోమంటాడు. వేడి వేడి అన్నంలో వెన్నకాచిన నెయ్యీ ఆవకాయతో అన్నం తిని, పగిలిన పెదవులు మండుతుంటే 'ఉస్సు...ఉస్సు' అనుకోవడం మీకు గుర్తొస్తోందా? విమానం వెళ్తుంటే బయటకి పరిగెత్తుకెళ్ళి ఆశగా చూసేవాళ్ళం. స్కూళ్ళు తెరవగానే, అమ్మతోకానీ, నాన్నతో కానీ నోటు బుక్కులూ, కొత్త పెన్సిళ్ళూ, రబ్బర్లూ, జామెంట్రీ బాక్సులూ, టెక్స్ట్ పుస్తకాలు కొనుక్కోవడానికి వెళ్ళి లైనులో నిలబడడం ఎంత బావుండేదీ? పుస్తకాలతో బాటు ఇచ్చే రంగురంగుల లేబుళ్ళూ!

అట్టలు వెయ్యడానికి లంచాలు అడిగే అన్నయ్యలూ, చెయ్యి తీరలేదనే అమ్మలూ. "అబ్బా నాకు ఆఫీసు పని ఉంది" అనే నాన్నలూనూ. మనం నిద్రపోయాకా, కోడిగుడ్డు లాంతరు పెట్టుకుని అట్టలు వేసి, తెల్లారి లేచేసరికి మన తల దగ్గర బొత్తిగా పెడితే ఎంత ఆనందంగా ఉండేదీ?

కొత్త పుస్తకాల వాసన ముందు ఏ పెర్ఫ్యూమ్‌లు పనికొస్తాయి?

సెంట్ రబ్బర్‌లు రుద్ది వాసన చూసుకోవడం ఎంత గొప్ప? రెండు జడలకీ కొత్త రిబ్బన్లు పెడితే, పైకి కట్టుకుని వెళ్తుంటే అంతా మన కొత్త రిబ్బన్లు వైపు చూస్తున్నట్లే ఉండేది.

స్కూల్లో 'రేపు ఫోటో తీస్తారు' అని చెపితే, ఆ రోజు కాన్వాసు షూసూ, తెల్లసాక్సులూ టినోపాల్‌లో వేసి ఉతుక్కుని, బూట్లు పాలిష్ చేసుకుని, యూనిఫార్మ్ ఇస్త్రీ చేసుకుని, రిబ్బన్లు గుంజి ఆరేసుకుని, ఎంత తయ్యారీ? అందరం వరుసగా కూర్చుంటే, నల్లబట్ట ముసుగేసుకుని ఫోటోగ్రాఫర్ 'రెడీ వన్...టూ..త్రీ" అని తీరా ఫోటో క్లిక్ మనిపించే టైంకి, వెనక్కి తిరిగో... తలకిందకేసుకునో, ముక్కులో వేలు పెట్టుకునో ఉండేవారు. ఫోటోలు వచ్చాకా అవి చూసి పెద్దాళ్ళు ఒకటే మందలింపులు.

పండగొస్తే, ముందే చింపించిన తాన్లు దర్జీకిచ్చి, పరికిణీ, జాకెట్టూ కుట్టమంటే, నిలబెట్టి అన్ని కొలతలూ తీసుకుని, పండగకి రెండు రోజుల ముందే ఇస్తాం అని మాటిచ్చి మా శ్రీశైలం పండగనాటికి కూడా కుట్టేవాడుకాదు. ఆ రోజు ప్రొద్దుటే తలంటి పోసుకుని తలల్లో, షీకాయా, కుంకుడుకాయ పిప్పి దులుపుకోకుండానే, అమ్మమ్మ నిప్పుల్లో వేసిన సాంబ్రాణి ధూపం వేయించుకోకుండానే, దర్జీ ఇంటికి పరుగులు.. "వసారాలో ఆడుకో చిట్టి తల్లీ, ఫైపింగ్ చేస్తున్నా" అంటే, కుట్టి ఇచ్చేదాకా, ఆ గుమ్మం వదిలేవాళ్ళం కాదు. కానీ పరికిణీ ఏం కుట్టేవాడనీ? వేసుకుంటే ప్రబంధనాయికల్లా ఉండే వాళ్ళు ఆడపిల్లలు.

పాపిడి పట్టీ, జడబిళ్ళలూ, జడకుచ్చులూ లేకపోయినా, చేమంతులూ, సన్నజాజులూ, కనకాంబరాలూ, మొగలిరేకులూ, గులాబీలూ, సంపెంగలూ, ఒక్కోక్కసారి డిసెంబర్ పూలూ, ముద్దబంతులతో, నిలువెల్లా నగలు పెట్టుకున్నట్లు, జడనిండా పూలు పెట్టుకుని సింగారించుకునేవారు ఆడపిల్లలు. ఇప్పటి ఆడపిల్లలు బొట్లు పెట్టుకోరు. ఒకవేళ పెట్టుకున్నా మన చేతుల్లో భూతద్దాలుంటే, వాళ్ళ మొహాన బొట్టుబిళ్ళ ఉన్నట్టు తెలుస్తుంది.

పిల్లాడు పుట్టగానే 'సాదు' చేసేవారు. మూకుడులో సగ్గుబియ్యం, కొంచెం నీళ్ళు వేసి కాచి, ఇగిర్చి, మాడ్చి నల్లని సాదు చేసి పిల్లలకి దిష్టి తగలకుండా బొట్టు పెట్టేవారు.

ఆముదం ఇత్తడి పళ్ళెంలో పోసి, దీపం మీద పెట్టి, కింద పట్టిన కాటుకని, వెన్నతో రంగరించి పిల్లల కళ్ళకి పెట్టేవారు.

ఆడపిల్లలు కాపురానికి వెళ్తుంటే, పసుపు తాడు పేని ఇవ్వడం, పెద్ద ముత్తైదువుల పని. ఆ తాడు పేనడం ఎంతకళని. ఎంత దృఢంగా, పచ్చగా, మెరిసిపోతూ ఉండేవీ? మెలి తిరిగి పేనిన తాడుని కింద వేసి, ఒక్క నీటి బొట్టు వేస్తే, గిరగిరా తిరిగేది "ప్రాణం వచ్చింది రమణమ్మా ఇంక వేడుకో" అనేది మా అత్తయ్య.

పెళ్ళిళ్ళల్లో కన్నెపిల్లల్ని తీసుకొచ్చి నల్లపూసలు గుచ్చిస్తే, త్వరలో వాళ్ళ పెళ్ళిళ్ళు అయిపోతాయని నమ్మకం. నల్లపూసలు గుచ్చడం ఎంత ముచ్చటైన పనీ? తమలపాకులతో చిలకలు చుట్టడం ఈ కాలపు పిల్లలకి ఎవరైన నేర్పుతున్నారా? తమలపాకు రసం జీర్ణ సుద్దికి ఎంత మంచిది?

సంక్రాంతి పండగ ముందు నెలపట్టడం ఎంత సరదా?

మా నాగులయ్య పేడ అమ్మడానికి ఎంత గర్వంగా ఫీల్ అయ్యేవాడో? పచ్చని పేడ.. ఆవుపేడ.. ఇంకెక్కడా ఇలా దొరకదు" అనేవాడు. మేం బక్కెట్టునిండా వేయించుకుని, బంగారం మోస్తున్న ఫీలింగ్‌తో వచ్చి, చిట్టి చిట్టి చేతులతో, గొబ్బెమ్మలు చేసి, మధ్యలో గుమ్మడి పువ్వూ, చుట్టూ బంతి పూలు పెట్టి, పచ్చగా పేడనీళ్ళు చల్లిన ముంగిళ్ళలో, ముగ్గులు పెట్టి, వాటి మధ్య గొబ్బెళ్ళు పెట్టి, "తామరపువ్వంటి తమ్ముడ్ని ఇవ్వవే.. చేమంతి పువ్వంటి చెల్లెల్ని ఇవ్వవే.." అని చేతులు తడుతూ తిరిగి మురిసిపోయేవాళ్ళం.

ఆ గొబ్బెమ్మలన్నీ పిడకలై, రథసప్తమి నాడు, పరవాన్నం వండితే రుచి తెచ్చేవి.

ఆడపిల్లలు బొమ్మలు పెట్టుకుంటూ, గొబ్బిళ్ళపాటలు పాడుకుంటూ ఉంటే, మగపిల్లలు గాలిపటాలు ఎగరేసుకుంటూ, మాంజాలు తయ్యారు చేసుకుంటూ "వాడు కళ్ళు సరిగ్గా పొడవలేదురా... అది గుడ్డి పతంగిరా.. సాఫ్... పేంచ్ వెయ్యి.. రాత్రి క్యాండిల్ పెట్టి ఎగరేస్తా.." అంటూ వాళ్ళ లోకంలో వాళ్ళు ఉండేవారు.

ఇంక పెద్దవాళ్ళు అసురుసుర్దై పిండివంటలు చేసేవారు. అరిసెల్లూ, జంతికలూ తప్పవు. చేగోడీలూ, పాలకాయలూ, మరచెంబు అంచుకి గవ్వలూ రోజూ మధ్యాహ్నాలు పనే.

పిండి దంచేవాళ్ళకీ, అరిశలొత్తేవాళ్ళకీ వాళ్ళ పనిముట్లు వాళ్ళకే ఉండేవి.

ఒక్క సంక్రాంతేవిటీ? ఏ పండగ ప్రత్యేకత దానిదే అమ్మవారి జాతరంటే, పాలోమని సికింద్రాబాద్ స్టేషన్ దగ్గరకి పోయేవాళ్ళం.. స్టేషన్ ముందు ఆల్ఫాహోటల్ నుండి, తిన్నగా మనోహర్ ధియేటర్ మీదుగా, ఉజ్జయినీ అమ్మవారి గుడిదాకా పేవ్‌మెంట్ల మీద రకరకాల అంగళ్ళు పెట్టేవారు.

లక్కపిడతలూ, చందనపు బొమ్మలూ, ప్లాస్టిక్ వంట సెట్లూ, ఫ్యాన్, రేడియో, టేబుళ్ళూ, కుర్చీలూ (టీ.వీలూ, ఫ్రిజ్‌లూ తెలీవు). రంగురంగుల రిబ్బన్లూ, గాజుల మలారాలూ.. చేతికి జీళ్ళ గడియారాలూ, ఉంగరాలూ, మరమరాల ఉండలూ, కొబ్బరి లౌజు ఉండలూ, జీడిమామిడి పండ్లూ, పొగడ పండ్లూ, అన్నీ కొనుక్కుని తినేవాళ్ళం. గొంతంతా పట్టేసేవి. పుల్ల ఐస్ తింటూ మోచేతులదాకా కారుతుంటే నాకేవాళ్ళం.

సందట్లో సడేమియా అని పోతరాజులు, ఊగిపోతూ తాళ్ళు పట్టుకుని పరిగెత్తుకొచ్చేవాళ్ళు.. పిల్లలం అంతా ఏడుస్తూ పరుగు. ఒక్కొక్కరికి వాతలు పడేవి. 'అబ్బా.. ఎంత మంచిదో ఆ దెబ్బ' అనుకునేవాళ్ళు. రాత్రిపూట జుట్టు విరబోసుకుని, ఎర్రని కళ్ళతో తాడు విసురుతూ పోతరాజులు కలల్లో కొచ్చేవారు. అయినా వెళ్ళడం మానేవాళ్ళమా? అబ్బే..'జాతర' అని ఒకటే గెంతులు.

దసరా ముందు 'ఉయ్యాలో ఉయ్యాల' అని బతుకమ్మలని తయ్యారు చేసి, ఆడ్తుంటే, వాళ్ళతో మేమూ గెంతులు. నీళ్ళల్లో పూల తేరుల్లా అవి తేల్తుంటే ఎంత అందంగా ఉంటాయో తెలుసుగా?

హైదరాబాదులో హోలీపండగ మాత్రం వదిలి పెట్టామా? కోజాగిరీ అని పౌర్ణమి నాడు వెన్నెల్లో పాలుకాచి, అందరికీ ఇచ్చేవారు ఆర్.ఎస్.ఎస్.వాళ్ళు. మర్నాడు కామదహనం... ఏమరపాటుగా ఉంటే ఇళ్ళల్లో కర్రకుర్చీలూ, మడత మంచాలూ అన్నీ మర్నాడు కాముడి దహనానికి 'కలప'గా మారేవి.

రాత్రి కాముడ్ని కాల్చి, ప్రొద్దుటే రంగులు రుద్దుకుంటూ, బుక్కాలు జల్లుకుంటూ హోలీ ఆడేవాళ్ళం. హోలీ పండగకోసం ఒక జత పాత బట్టలు దాచుకునేవాళ్ళం. తర్వాత రకరకాల రంగులద్దినట్టున్న బట్టల్ని చూసుకుని మురిసిపోయేవాళ్ళం.

పిల్లలూ, పెద్దాళ్ళూ కూడా చాలా ఇష్టపడే పండగ దీపావళి. అప్పట్లో సూరేకారం, భాస్వరంలాంటి పేర్లు మాట్లాడ్తూ, అవన్నీ కొని ఇళ్ళల్లో చిచ్చుబుడ్లూ, మతాబాలు చెయ్యడం రివాజుగా ఉండేవి. పిడతల్లో చేసే చిచ్చుబుడ్లు ఒక్కోసారి పువ్వులు వెదజల్లితే, కొన్నిసార్లు 'ఢాం' అని పేలేవి. మతాబులు ఊపినప్పుడల్లా పువ్వులు రాలుస్తూ, మధ్య మధ్యలో మౌనముద్ర దాలుస్తూ అంతలో కిలకిలలాడ్తూ వాటి స్టైలు వాటివి.

నేలంతా మచ్చలు పడేట్లు పాముబిళ్ళలు కాల్చేవాళ్ళం. అవి పొగ రేపుతూ ఇంత లావున 'పాము'లా పైకొస్తుంటే, చప్పట్లు కొట్టేవాళ్ళం. అవ్వాయి తువ్వాయిలు ఒక్కోసారి ఎదురింటి డాబాల మీద వాళ్ళ 'పంచె'లో దూరి గలాటా చేసిన సందర్భాలూ ఉండేవి. సిసింద్రీలు అల్లరి చెప్పక్కర్లేదు.

మీ చెయ్యి గిర్రున తిరిగిపోకుండా బొప్పాయి ఆకుల కాడలు విరిచి, వాటిల్లో విష్ణుచక్రాలు గుచ్చి అమ్మా నాన్నలు కాల్పించడం గుర్తుందా?

నేలంతా గిర్రున తిరిగి అక్కడక్కడా తమ ఆనవాళ్ళు వదిలిపెట్టే భూచక్రాలూ, వదలగానే పైకి దూసుకెళ్ళే 'తారాజువ్వలూ' అన్నీ ఇప్పుడూ ఉన్నాయి.. కానీ ఆ సరదాలేవీ?

వారం ముందే ఇంటిముందు మంచం మీద దుప్పటి పరిచి, ఇవన్నీ ఎండ పెట్టి కాపలా కాయడంలో మజావేరు కదా!

చివరాఖరులో 'దిబ్బూ దిబ్బూ దీపావళీ.. మళ్ళీ వచ్చే నాగుల చవితీ' అని తిప్పి నేలకి కొట్టేవాళ్ళం టపాసులు.

శ్రావణమాసం, వినాయకచవితి, శ్రీరామనవమీ, శ్రీకృష్ణాష్టమి వీటి గురించి మాట్లాడకపోతే ఇంక చిన్నతనపు రోజులకి అర్థం ఏవిటీ?

ఆడపిల్లలకి అతి ముఖ్యమైనది శ్రావణమాసం కదా! చిటపట చినుకులు పడ్తుంటే, పట్టు పరికిణీ అంచులకి బురద అంటకుండా, పైపైకి లాక్కుంటూ, ఇంటింటికీ వెళ్ళి పసుపులు రాయించుకుని, పసుపూ, బొట్టూ, సెనగలూ, అరిటిపళ్ళూ, తాంబూలాలతో, కర్చీఫ్‌లు నిండిపోతే, ఆ ఇంటివారినే అడిగి పెద్ద పెద్ద కవర్లో, సంచులో తీసుకుని సెనగలు పోసుకుని, ఎవరికి ఎంత మూటొచ్చిందో చూసి మురిసిపోతూ, ఇళ్ళకి పరుగులు పెట్టడం అవి సాతాళించి పెట్టేదాకా పెద్దాళ్ళ ప్రాణాలు కొరుక్కు తినెయ్యడం.... మళ్ళీ గుర్తుచేసుకోండి.

వినాయక చవితికి ఇలా పత్రి కొనుక్కురావడమా? ఎన్ని కంచెలు దూకేవాళ్ళం? ఎంతగా మోకాళ్ళు గీరుకుపోయేవి? రకరకాల ఆకులు, కాయలు, కోసి సంచులనిండా తెచ్చి ఘనకార్యం చేసినట్లు పోజు పెట్టి 'వీరగంధము తెచ్చినారము.. వీరుడెవ్వడో తెల్పుడీ' అన్నట్లు నిలబడేవాళ్ళం.

పాలవెల్లి స్వంతంగా వెదురుబద్దలు వంచి తయ్యారు చేసి, వాటికి పచ్చి సీతాఫలాలూ, జిల్లేడు, మారేడు, వెలగ, సపోటా, మొక్కజొన్న కండెలు కట్టి, క్రింద మండపంలో మట్టివినాయకుడిని, బంక మట్టితో తయ్యారు చేసి నిలబెట్టి ఎంత బక్తిగా పూజలు చేసేవాళ్ళం? పుస్తకాలు వాటి కింద పెడితే చదువంతా తలకెక్కించే పని వినాయకుడిదే అని మా నమ్మకం. ఉండ్రాళ్ళ మీదా జిల్లేడు కాయల

మిదా లస్కోరా మీదే మనసు లగ్నం చేసి 'ఓ బొజ్జ గనపయ్యా.. నీ బంటు నేనయ్యా.. ఉండ్రాళ్ళ మీదకి దండు పంపు' పాడుకునేవాళ్ళం.. తొమ్మిది వినాయకుళ్ళని చంద్రుడొచ్చేలోగా చూడాలని ఇళ్ళన్నీ చుట్టబెట్టేవాళ్ళం. అందరిళ్ళల్లో ప్రసాదాలే.. తిని తిని కడుపు ఉబ్బి పొయ్యేది.

ఆకతాయి కుర్రాళ్ళు కావాలని తిట్లు తినేవాళ్ళు ఇళ్ళమీద రాళ్ళేసి. నెత్తిమీద అక్షింతలేసుకుని, చంద్రుడ్ని చూస్తామేమో అని భయపడ్తూ పెందరాడే ఇల్లు చేరేవాళ్ళం. పండగలూ, పబ్బాలే కాదు మా చిన్నతనంలో అన్నీ వేడుకలే.

మీ ఇంటిముందు కొచ్చిన గంట కొట్టే మిఠాయిబండీ గోళీ సోడాబండీ గుర్తుందా? శివరాత్రి నాడు మూడో ఆటకూడా వేసేవారు. ధియేటర్ ఊడ్చేవాళ్ళు నిద్రలేపి బతిమాలి ఇంటికి పంపించేవారు. రైల్లో ఊరికెళ్తామంటే ఎంత సరదా? ఎన్నెన్ని అమ్మొచ్చేవీ? తెల్లవారు ఝామునే లేచి రాక్షస బొగ్గు వేసి స్నానాలకోసం బాయిలర్ అంటించడం గుర్తొస్తోందా?

ఆరుబైట స్నేహితులతో ఆటలాడుకుంటూ చీకటిపడినా ఇల్లు చేరక అమ్మా, నాన్న చేతి దెబ్బ రుచి చూడటం కూడా ఒకసారి గుర్తుచేసుకోండి. రోటిలో నూరిన పచ్చళ్ళు. రుబ్బురోలులో రుబ్బుకున్న గోరింటాకు గుర్తురావట్లా?

రేడియో స్టేషన్‌కి వెళ్ళి బాలానందంలో పాటపాడటం. రేడియో అన్నయ్యా, అక్కయ్యా ఎక్కడైనా కనిపిస్తే పరిగెత్తుకెళ్ళి, చేతులు పట్టుకుని ఆనందపడడం. రేడియో చుట్టూ కూర్చుని సంక్షిప్త శబ్ధ చిత్రాలు విన్నారా, బ్లాక్ అండ్ వైట్ టీవీలు వచ్చిన కొత్తలో దూరదర్శన్‌లో పాలూ చేలూ వదిలిపెట్టకుండా చూసారా లేదా?

ఇవన్నీ ఎందుకు గుర్తు చేస్తున్నానంటే మనం ఇళ్ళల్లో రేడియో సెట్లూ, కెమేరా పెట్టెలూ, టూ ఇన్ వన్ టేప్ రికార్డర్లూ, సినిమా హాళ్ళల్లో బ్లాక్ అండ్ వైట్ సినిమాలూ, ఇళ్ళల్లో వీ.సి.ఆర్‌లూ, క్యాసెట్లూ, బంధువులకి కష్టం వచ్చినా సుఖం వచ్చినా తెలియజేసే టెలిగ్రాంలూ, చివరకి పోస్ట్ కార్డులూ, కవర్లూ, చేతి వాచీలు, అన్నీ కాలగర్భంలో కలిపేసి, సెల్‌ఫోన్లూ, ఐ పేడ్‌లూ, వాట్స్‌అప్‌లూ, ఫేస్‌బుక్‌లతో కాలక్షేపం చేసేస్తున్నాం. పుట్టగానే ఇప్పుడు ఫ్లైట్స్, టీవీలు, వీడియోలు.

కానీ వీటిల్లో రాత్రంతా వేచి తెల్లారే నేలరాలిన పారిజాతల్లాంటి పాత జ్ఞాపకాలున్నాయా? మట్టివాసనలులాంటి, కాకెంగిలి చేసి తిన్న జామకాయ రుచులున్నాయా?

పాలకెళ్ళొస్తూ, దారిలో దొరికిన బాదంకాయలు చెంగులో తెచ్చి, పగలకొట్టి పప్పు తిన్న ఆ మాధుర్యం ఉందా?

అన్నీ కరిగిపోయాయి.. కాలంతో పరుగులు పెడుతూ మనమూ వేగంలో కలిసిపోయాం.. కానీ అరవై, డెబ్బైలలో పుట్టిన వాళ్ళకి ఓసారి గుర్తుచేద్దామనీ..

**గతంలోకి మీతో కలిసి ఓసారి నడిచొద్దామనీ...**

Post your comments

